క్లుప్తంగా

వైభవంగా అంకురార్పణ

తిరుపతి రూరల్: ముత్యాలరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన గౌరిశంకర ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గౌరి సమేత శంకర, సాయినాథ, విఘ్నేశ్వరుడు, సుబ్రమణ్యస్వామి, ప్రత్యేక శనీశ్వరుడు, నాగశిలలు, నవగ్రహాలు స్వామివార్ల ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా మొదటిరోజు మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త శ్రీరాములు తెలిపారు.

ఆలయ పునర్ నిర్మాణానికి విరాళం



దాతను సత్కరిస్తున్న ఆలయ చైర్మన్

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ అమ్మవారి ఆలయ పునర్ నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. సుమారు రూ.3.5 కోట్లతో ఆలయ పునర్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. మంగళవారం తిరుపతి రూరల్ మండలం కాలూరుకు చెందిన బొల్లినేని జ్ఞాన ప్రసూన, మల్లెల శ్రీధర్ రూ.51 వేలను ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వారికి అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

జెడ్పీటీసీ కార్యాలయం ప్రారంభం



తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన జెడ్పీటీసీ కార్యాలయాన్ని మంగళవారం జెడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. రానున్న రోజుల్లో మండలంలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం అవసరమైన చోట వినియోగించుకునేలా రూ.25 లక్షల జెడ్పీ నిధులను మంజూరు చేసినట్లు జెడ్పీటీసీ రత్నమ్మ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు యశోద, మాధవరెడ్డి, మూలం చంద్రమోహనరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రపతి బయోగ్రఫీ ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్, జూనియర్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బయోగ్రఫీని మంగళవారం తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేకాం చైర్మన్ నామా రాజేష్‌కుమార్, జేసీఐ తిరుపతి అధ్యక్షుడు గుణశేఖర్, కార్యదర్శి జయలక్ష్మి తేజ, ఒడిసి అధ్యక్షులు గౌతమి, సభ్యులు లావణ్య, డాక్టర్ రఘురాములు, వరలక్ష్మి, ప్రవీణ్, హరి, స్వప్న పాల్గొన్నారు.

మహిళలకు చదువు అవసరం

పాకాల: సమాజంలో మహిళలను తక్కువగా చూడకూడదని, నేటి సమాజంలో ప్రతి ఇంటికీ మహిళల చదువు చాలా అవసరమని అనంతపురం జేఎన్‌టీయూ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వి.బి.చిత్ర తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ లింగ వివక్ష చూపకూడదని, అక్షరాస్యతను మహిళల్లో మరింతగా పెంచాలని సూచించారు.

విశ్వం కరస్పాండెంట్‌కు అంతర్జాతీయ అవార్డు



తులసి విశ్వనాథ్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎన్.తులసి విశ్వనాథ్‌రెడ్డికి అంతర్జాతీయ అవార్డు వరించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అంతర్జాతీయ మనం ఫౌండేషన్ సంస్థ ×వరల్డ్ గోల్డ్ హ్యూమానిటేరియన్ ఉమెన్ అవార్డు–2023×కి ఎంపిక చేసింది. విద్య, సేవా రంగాల్లో ఇతరులకు ఆదర్శంగా నిలుస్తూ ఆమె చేస్తున్న కృషి, ప్రతిభకు గుర్తింపుగా ఆమెను ఎంపికచేశారు. అంతర్జాతీయ అవార్డుకు ఎంపికైన ఆమెను విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

టిప్పర్ ఢీకొని మహిళ మృతి

రామచంద్రాపురం: దుర్గసముద్రం సమీపంలో టిప్పర్ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ గిరిబాబు కథనం.. సీరామాపురం పంచాయతీ, ఇందిరమ్మ కాలనీకి చెందిన వెంకటరమణ తన భార్య నాగమణి (49)తో కలిసి ద్విచక్రవాహనంలో తిరుపతికి బయలుదేరాడు. మార్గమధ్యంలో దుర్గసముద్రం సమీపంలోని ప్రధాన రహదారి వద్ద ఆర్సీ పురం నుంచి గ్రావెల్ లోడ్‌తో తిరుపతి వైపు వెళ్తున్న టిప్పర్ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగమణి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. భర్తకు స్వల్పగాయాలయ్యాయి. మృతురాలికి ముగ్గురు కుమార్తెలున్నారు.

విజయనారీ

ఆప్యాయతలో అనురాగం.. ప్రేమలో మమకారం
ఇంటికి ఆదర్శం.. పాలనలో సగభాగం
ఇదీ నేటి తరం మహిళా లోకం

అమ్మగా, చెల్లిగా, భార్యగా, అనురాగమూర్తిగా ఈ సమాజంలో మహిళకున్న విశిష్టత స్థానం అమోఘం. అంతరీక్షంలో దూసుకెళ్లడం నుంచి రాజకీయాల్లో పాల్గొని పాలనా పగ్గాలు పట్టడం వరకు పురుషునితో దీటుగా ప్రతి పనిలోనూ పాలుపంచుకుంటున్నారు. భుక్తిమార్గాన్ని వెతుక్కుంటూ కుటుంబ భారాన్ని నెత్తికెత్తుకుని అవలీలగా వెళ్లిదుతున్నారు. చంకలో బిడ్డనేసుకునే కూలిపని చేస్తూ పొట్టపోసుకుంటున్నారు. ఏపనిలోనూ మగవారికి తగ్గమని నిరూపిస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్స్, తిరుపతి







శాస్త్రోక్తం.. మహా చండీహోమం



పూర్ణాహుతిలో మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి



ప్రత్యేకాలంకరణలో గంగమ్మ

తిరుపతి కల్చరల్ : హోలీ పండుగను పురస్కరించుకుని మంగళవారం తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శాస్త్రోక్తంగా మహా చండీహోమం నిర్వహించారు. ఉదయం 8.30 నుంచి ఆరంభమైన హోమపూజల్లో 51 మంది దంపతులు పాల్గొన్నారు. నగర మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, తుడా కార్యదర్శి లక్ష్మీ ముఖ్యఅతిథులుగా హాజరై అమ్మవారిని సేవించుకున్నారు. 11.45 గంటలకు మహా పూర్ణాహుతితో హోమం ముగిసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈఓ ఎం.మునికృష్ణయ్య, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం రామారావు, జేసీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, ఆలయ కమిటీ సభ్యులు ఎం.హరినాథ్‌రెడ్డి పి.ధనశేఖర్, వి.కృష్ణయ్య, ఎన్.భారతి పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధితో మహిళా సాధికారత



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటనారాయణ

తిరుపతి రూరల్: విద్యతో పాటు ఆర్థికాభివృద్ధితోనే మహిళా సాధికారత సాధ్యమని తిరుపతి రూరల్ ఎంపీడీఓ వెంకటనారాయణ తెలిపారు. సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ స్త్రీశక్తి భవన్‌లో మంగళవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలకు వివిధ అంశాలపై పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. సెర్ప్ ఏరియా కో–ఆర్డినేటర్ సతీష్, ఏపీఎంలు గురునాథరెడ్డి, పరశురాంరెడ్డి, సీసీలు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న వక్తలు

తిరుపతి ఎడ్యుకేషన్ : సీఎంఏ తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఎస్వీయూలోని ఎంబీఏ భవనంలో జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్టేట్ ట్యాక్స్ అండ్ అప్పిలేట్ అథారిటీ అదనపు కమిషనర్ బాలాజీ బాబు హాజరయ్యారు. జీఎస్టీ నిర్మాణాన్ని అర్థం చేసుకోవడం, సకాలంలో రిటర్న్‌లు దాఖలు చేయడం, జీఎస్టీ నియమాలు, నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూడడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్వీయూ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగపు ప్రొఫెసర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పరోక్ష పన్నుల విధానాల్లో మార్పులు స్టాక్ మార్కెట్‌ను ఎలా ప్రభావితం చేస్తాయన్న అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో సీఎంఏ తిరుపతి చాప్టర్ చైర్మన్ రమేష్ దామర్ల, వైస్ చైర్మన్ పార్థసారథి, సభ్యులు, సీఎంఏ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళా సాధికారత




మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ సుకుమార్

తిరుపతి రూరల్: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్)లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం తిరుపతి కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు వీఎన్ బాబు, శివప్రసాద రెడ్డి మాట్లాడుతూ దేశ అభ్యున్నతికి మహిళా శక్తి కీలకమని, విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం అవుతుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ వరకుమార్, జాయింట్ సెక్రటరీ రాధాజయశ్రీ, జనరల్ మేనేజర్లు పద్మ, శారద, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వాసవీలత, పర్సనల్ ఆఫీసర్ సుబ్బలక్ష్మి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రగిరి: మహిళలు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో స్వావలంభన సాధించేలా వారికి అవగాహన కల్పించాలని చంద్రగిరి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుకుమార్ అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం పాలిటెక్నిక్ కళాశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధిలో పురుషులతో పాటు సమానంగా మహిళలు సహాయ పడుతున్నారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో సమానత్వం కోసం విద్యార్థి దశ నుంచే కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అధ్యాపకులు, విద్యార్థినులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, సాంస్కృతిక పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఓడీలు పాల్గొన్నారు.

నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ ఓబులేసు

చంద్రగిరి: ఓ వ్యక్తిపై తీవ్రంగా దాడి చేయడంతో పాటు గుండు కొట్టించిన కేసులో ప్రధాన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం సీఐ ఓబులేసు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఏ.రంగంపేటకు చెందిన తోట వంశీ నాలుగేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అనంతరం వారు ఏ.రంగంపేటలో కాపురం పెట్టారు. వంశీ చంద్రగిరికి చెందిన హర్షవర్ధన్ అనే వ్యక్తి వద్ద ఆటోను బాడుగకు తోలుకునేవాడు. అయితే వంశీతో అతని భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. అతను బెంగళూరులో ఫుడ్ డెలివరీ బాయ్‌గా చేసుస్తున్నాడు. అయితే తన భార్యతో హర్షవర్ధన్ అక్రమం సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో తరచూ సోషల్ మీడియా, ఫోన్ కాల్స్ ద్వారా వంశీ గొడవకు దిగేవాడు. ఈ క్రమంలో వంశీ తన ఫేస్‌బుక్ ఖాతాలో తన భార్య, హర్షవర్ధన్ చనిపోయారంటూ(రిప్) పోస్టు చేయడంతో, గత నెల 8వ తేదిన హర్షవర్ధన్ అతని స్నేహితుడు అన్వర్‌తో పాటు మరికొందరు కలసి బెంగళూరుకు వెళ్లి వంశీని బలవంతంగా చంద్రగిరిలోని తన పొలంలోకి తీసుకెళ్లి విచక్షణరహితంగా దాడి చేయడంతో పాటు గుండు కొట్టించాడు. ఘటనకు సంబంధించిన వీడియోలు వైరల్ అయిన విషయం తెలిసిందే. దీనిపై బాధితుడు గత శనివారం రాత్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ క్రమంలో పరారీలో ఉన్న ప్రధాన నిందితులు హర్షవర్ధన్, అన్వర్‌ను మంగళవారం చంద్రగిరి నాగాలమ్మ కూడలి వద్ద అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వీరికి సహకరించిన మరో ముగ్గురిపై దాడి, కిడ్నాప్, నిర్బంధం వంటి పలు సెక్షన్లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

ఏప్రిల్ 14 నుంచి 'మోదీ హటావో దేశ్ బచావో' యాత్ర

తిరుపతి కల్చరల్: అదానీ కంపెనీ వ్యవహారాలపై జాయింట్ పార్లమెంట్ కమిటీ విచారణ చేపట్టాలని, వివరాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 14 నుంచి మే ఒకటి వరకు చేపట్టిన మోదీ హటావో దేశ్ బచావో అనే నినాదంతో దేశవ్యాప్తంగా పాదయాత్రలు చేపడతామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఎన్నికల కరపత్రాన్ని అందజేస్తున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి తుడా : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి మంగళవారం ఎస్వీ మెడికల్ కళాశాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ గ్రాడ్యుయేట్ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కరపత్రాలను పంచిపెట్టారు. అధ్యాపక బృందాన్ని కలిసి టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఎస్వీ పాఠశాల వార్షికోత్సవం

తిరుపతి అలిపిరి: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ఉన్నత పాఠశాల 137వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవస్థానం విద్యాశాఖ అధికారి డా.ఎం.భాస్కర్‌రెడ్డి, ప్రత్యేక అతిథిగా స్విమ్స్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వి.వనజాక్షమ్మ విచ్చేసి ప్రసంగించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ60 వేల నగదు బహుమతి అందజేశారు.

ఇద్దరికి గాయాలు

చంద్రగిరి: ఎదురెదురుగా వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు గాయాలపాలైన ఘటన మంగళవారం రాత్రి స్థానిక ఇందిరమ్మ కాలనీ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా సదుంకు చెందిన సూరి, గంగులు మేకల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వ్యాపార నిమిత్తం మండల పరిధిలోని మండపంపల్లికి బైక్‌పై వెళ్తుండగా, గంగుడుపల్లి నుంచి చంద్రగిరికి వస్తున్న ఆటో ఇందిరమ్మ కాలనీ వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో సూరి తలకు తీవ్ర గాయం కాగా, గంగులుకు కుడికాలు విరిగింది. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు జడ్జి



ఆలయం వెలుపల సుప్రీంకోర్టు జడ్జి పంకజ్ మిథాల్

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పంకజ్ మిథాల్ కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏవీఎస్ఓ శైలేంద్రబాబు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకున్న ఆయన అమ్మవారిని మూలవిరాట్‌ను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ జగన్నాథ రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

107 మంది రక్తదానం



శిబిరంలో వైద్యులు, జూనియర్ డాక్టర్లు

తిరుపతి తుడా : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్వీ మెడికల్ కళాశాల, రుయా ఆస్పత్రి వైద్యుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మొత్తం 107 మంది వైద్యులు, సిబ్బంది, విద్యార్థినులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, సూపరింటెండెంట్లు నాగమునీంద్రుడు, పార్థసారథిరెడ్డి, డాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్స్ వెంకట్, వసుంధరాదేవి పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించుకుందామని తిరుపతి కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.కె.బాబు పిలుపునిచ్చారు. తిరుపతిలోని 12వ వార్డులో మంగళవారం కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షుడు, పార్టీ నాయకులు విస్తృతంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మీ కమిట్‌మెంట్‌కు హ్యాట్సాఫ్ అన్న'



నూతనంగా నిర్మించిన ఫ్రీలెఫ్ట్ రోడ్డును పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్

తిరుపతి తుడా: ఏళ్ల తరబడి వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యను రాత్రికి రాత్రే పరిష్కారానికి కృషి చేసిన డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డికి సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మార్‌పల్లి పోలీసుస్టేషన్ కూడలిలో నాలుగు రోడ్లు కలుస్తుండడంతో నిత్యం రద్దీతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. స్థానికులు ఈ సమస్యను డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రెండురోజుల క్రితం కారులో అటుగా వచ్చిన ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. సోమవారం అర్ధరాత్రి నుంచి వైకుంఠపురం కూడలి నుంచి వచ్చే వాహనాలను సులభంగా నగరంలోకి మళ్లించేందుకు ఫ్రీలెఫ్ట్ రహదారిని రాత్రికి రాత్రే దగ్గర ఉండి పూర్తి చేయించారు. ఉదయానికల్లా నగర వాసులు ఆశ్చర్యపడేలా ఫ్రీలెఫ్ట్ రోడ్డు దర్శనమిచ్చింది. దీంతో మంగళవారం ఉదయం ఆయనకు స్థానికులు, పోలీసులు 'మీ కమిట్‌మెంట్‌కు హ్యాట్సాఫ్ అన్న' అంటూ కృతజ్ఞతలు తెలిపారు.

పేర్నాటి గెలుపుతో యువత సంక్షేమం



మాట్లాడుతున్న ముదిరాజ్ ముత్తరాసి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ నారాయణ

తిరుపతి కల్చరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపిస్తే రాష్ట్రంలో యువత సంక్షేమం సాధ్యమని ముదిరాజ్ ముత్తరాసి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ నారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముదిరాజ సంఘ నేతలతో కలిసి మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాలకు రాజ్యాధికారం దిశగా బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. ముదిరాజ్ సంఘ జిల్లానేతలు రవి ముదిరాజ్, జీవరత్న ముదిరాజ్ పాల్గొన్నారు.

స్కూల్‌లో తనిఖీ చేసి నివేదిక ఇవ్వండి



మాట్లాడుతున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : తిరుపతి మండలంలోని ఓటేరు స్కూల్‌లో తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రూరల్ ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఓటేరు సర్పంచ్ లక్ష్మి సమావేశంలో మాట్లాడుతూ తమ గ్రామం ఓటేరు జెడ్పీ హైస్కూల్లో ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, బాలికలను వేధిస్తున్నారని, టీచర్లకు చెప్పినా పట్టించుకోవడం లేదని తెలిపారు. దీనిపై పోలీసులు సైతం స్పందించడం లేదని, ఆకతాయిలను అడ్డుకునేందుకు రక్షణ కల్పించాలని కోరారు. సమావేశానికి తిరుచానూరు పోలీసులు హాజరు కాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ మోహిత్ రెడ్డి మాట్లాడుతూ స్కూల్‌ను సందర్శించి నివేదిక ఇవ్వాలని ఎంఈఓను ఆదేశించారు. పేరూరు, ఓటేరులో మురుగు కాలువలను నిర్మించాలని, వేమూరుకు బస్సులను ఏర్పాటు చేయాలని ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విన్నవించారు.

ప్రతి అర్జీని పరిష్కరిస్తాం..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామని ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే ప్రత్యేక సమావేశం నిర్వహించి అన్ని సమస్యలపై చర్చిద్దామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ రత్నమ్మ, వైస్ ఎంపీపీలు వేముల యశోద, విడుదల మాధవరెడ్డి, ఎంపీడీఓ వెంకటనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక అందజేత



పెళ్లి కానుకను అందజేస్తున్న నాయకులు

పాకాల : మండలంలోని తలారిపల్లిలో త్వరలో పెళ్లి చేసుకోనున్న తలారి డిల్లీబాబు, విమలకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిణీ చేస్తున్న పెళ్లికానుక స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. మంగళవారం వధూవరులకు బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, బాజికాలు, పట్టువస్త్రాలు, తిరుమల శ్రీవారి ప్రసాదంతో కూడిన కానుకను అందజేశారు.

చంద్రగిరి: మండలంలోని నరసింగాపురం పంచాయతీకి చెందిన అఖిల్ కుమార్, శిరీష త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారు. వీరికి వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచు చెంచురత్నం శెట్టి, ఎంపీటీసీ అశ్విని కాబోయే నూతన వధూవరులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి పంపించిన పెళ్లికానుకను అందజేశారు.